క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీరంగరాజపురంలో

శ్రీరంగరాజపురం: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా కరెంట్ సరఫరా ఉండదన్నారు.

యోగా రాష్ట్ర పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

విజయపురం(నగరి): విజయపురం మండలం పన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.జానకి రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో గురువారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 పోటీల్లో బాలికల విభాగంలో కె.జనని, అండర్-17 బాలుర విభాగంలో పదవ తరగతి విద్యార్థి పి.ప్రసాద్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు బి. గురప్పను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఆరేటమ్మ ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

పుత్తూరు రూరల్: పుత్తూరు గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయ ఆర్చి నిర్మాణానికి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన వి.వెంకటేశు, సుగుణ, కిరణ్‌కుమార్ రూ.40 వేలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డికి అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఆర్చి తుది దశ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఈ నగదును పెయింటింగ్ పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

కూలిన జెడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ



కూలిన పాఠశాల మైదాన ప్రహరీ గోడ

గంగాధర నెల్లూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానం ప్రహరీ గోడ కూలిపోయింది. రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు ఇది కూలిపోయినట్టు గుర్తించామని, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు దినకరన్ చెప్పారు. విద్యార్థులు ఆటలాడే సమయంలో ఇది జరిగి ఉంటే ప్రమాదానికి దారి తీసి ఉండేదన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



సూచనలిస్తున్న ఎంఈఓ

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజన తనిఖీ తదితర అంశాలను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాటించాల్సిన అంశాలపై సూచనలు ఇచ్చారు.

సచివాలయం, ఆర్బీకే పరిశీలన

వెదురుకుప్పం: సీఎం జగనన్న మానస పుత్రిక గ్రామ సచివాలయ వ్యవస్థ అని ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కదొనలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, నీళ్ల ట్యాంకులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు చెప్పారు. చిన్న చిన్న పనులు మినహా పక్కా భవన నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్ గోవిందయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, గణపతిరెడ్డి, విక్రమ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల ఇంట వెలుగులు

- ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి రోజా



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శుక్రవారం సాయంత్రం వడమాలపేట మండలం పత్తిపుత్తూరు సచివాలయ పరిధిలోని చింతకాల్వ, పచ్చికాల్వ, అమ్మగుంట పంచాయతీలో నిర్వహించిన గడప పడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకొందా? అమ్మ ఒడి చదువు అందిస్తోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా రూ. లక్షల్లో లబ్ధి చేకూరుతోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు అందుతున్నాయని తెలిపారు. పల్లె చెంతకే పాలనను తీసుకు వస్తూ మహాత్మ గాంధీజీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో నేటి ప్రభుత్వ పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించే చంద్రబాబునాయుడు, తర్వాత ప్రజలను మోసం చేయడం నైజమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయడం జగనన్న నైజమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నందయ్య, అయ్యప్పరెడ్డి, శేఖర్, సురేష్‌రాజు, కిరణ్, మునిబాబు, తులసి, కమల, రాజశేఖర్, రవిరెడ్డి, మంజులారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

21న ప్రత్యేక రెవెన్యూ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, పక్కన జడ్జి జానకి

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో ఈనెల 21వ తేదీన రెవెన్యూ కేసుల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను తహసీల్దార్లు, న్యాయవాదులు విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం కోర్టు ఆవరణలో తహసీల్దార్లు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సబ్ కోర్టు పరిధిలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, పుత్తూరు, నగరి తహసీల్దార్లు పరమేశ్వరస్వామి, అమరేంద్రబాబు, ఏజీపీ ఉదయ్‌కుమార్, న్యాయవాది సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి కట్టి శబరిమలైకు..





పుష్పాలంకరణలో అయ్యప్పస్వామి, భజన చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పాలంకరణ, పుష్పార్చన పూజలు వైభవంగా జరిగాయి. ఇరుముడులు ధరించిన భక్తులు శబరిమలైకు వెళ్లేముందు రోజు పుష్పార్చన పూజలు చేయడం ఆనవాయితీ. భక్తులు పుష్పాలతో ఆలయాన్ని, అయ్యప్ప స్వామిని నేత్ర పర్వంగా అలంకరించారు. ఆలయం బయట చలువ పందిళ్లు వేశారు. అయ్యప్ప భజనలు, నామ స్మరణలతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అయ్యప్ప స్వామి దర్శనానికి భక్తులు అశేష సంఖ్యలో విచ్చేశారు. 18 మెట్లకు వెలిగించిన కర్పూర దీపాలను దర్శించుకుని పారవశ్యం చెందారు. పుష్పార్చన పూజకు వాడిన పుష్పాలను, తులసిని మహిళలు ప్రసాదంగా తీసుకెళ్లారు. మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువలో భాగస్వాములు కావాలి





హాజరైన వలంటీర్లు, అధికారులు, మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: పాడి రైతులందరూ జగనన్న పాలువెల్లువలో భాగస్వాములు అయ్యేలా వలంటీర్లు కృషి చేయాలని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అదనపు ఆదాయం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జగనన్న పాలువెల్లువను ప్రవేశపెట్టిందన్నారు. వలంటీర్లు ప్రతి కుటుంబాన్ని సర్వే చేసి పాల వెల్లువ లబ్ధిదారులను గుర్తించాలన్నారు. పాడి ఆవుల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని, ఆసక్తి కలిగిన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంతోపాటు అమ్మపల్లె, అన్నూరు, ఎంఎం విలాసం, కొల్లాగుంట, కొటార్వేడు, ఆర్కేవీబీ పేట, కత్తెరపల్లె తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఎం విజయకుమార్, పశు వైద్యాధికారి హేమాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊయలలూగుతున్న అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీ కల్యాణ వేంకటేశ్వరాస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీపద్మావతీ అమ్మవారు ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలు జరిగాయి. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని అధిష్టింప చేశారు. అంతర ప్రాకారంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారు ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఊయలలో సేదతీరుతున్న అమ్మవారిని దర్శించి భక్తులు తరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రశేఖర్‌రాజు

పుత్తూరు రూరల్: రబీ సాగుకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని వడమాలపేట వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పీసీ.చంద్రశేఖర్‌రాజు కోరారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో సలహా కమిటీ సమావేశం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అందజేయాలని కోరారు. ఉద్యానవన శాఖ పంటలకు సంబంధించిన పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా సలహా మండలి సభ్యులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ చెరకు ఫ్యాక్టరీలు లేనందున పంట సాగు విస్తీర్ణం తగ్గించుకోవాలని, ప్రస్తుతం పంట రుణాలు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఉద్యానవన శాఖాధికారి వెంకటసౌజన్య, పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, సభ్యులు మునిరెడ్డి, చెంగల్‌రాజు, జయరామిరెడ్డి, వెంకటముని, వ్యవసాయ సిబ్బంది మోహన్, యమున. దివ్య, రేఖ పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి



ఉష మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: డెంగీ లక్షణాలతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఈదువారిపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం..గ్రామానికి చెందిన సీ.ఉష(37) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తొలుత ఓ ప్రైవేటు ఆస్పత్రిలో, ఆ తర్వాత తిరుత్తణిలో మరొక ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో చెన్నైలో చికిత్స పొందేందుకు ప్రైవేటు వాహనంలో వెళుతుండగా మార్గ మధ్యంలో ఆమె మృతి చెందింది. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ వివరణ కోరగా.. మృతురాలి ట్రీట్‌మెంట్ రికార్డులు పరిశీలించగా ఆమెకు ప్లేట్‌లెట్స్ సాధారణంగా ఉన్నట్లు నమోదు చేశారని, ప్రైవేటు వైద్యులు ర్యాపిడ్ టెస్టులు చేయడం వల్ల డెంగీ లక్షణాలు ఉన్నట్లు చూపారని, అయితే ఆ గ్రామంలో ఎవరికీ డెంగీ జ్వరం లేదని ఆయన పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఈదువారిపల్లెకు వెళ్లి ఉష మృత దేహంపై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ధనంజయవర్మ, గాంధీ, రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మురగయ్య, ఉప సర్పంచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నిండ్ర: రాష్ట్రంలో రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రైతు భరోసా కమిటీ మండల చైర్మన్ వీరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో రైతు సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ రైతులకు అవసరమైన అన్నింటినీ ఆర్‌బీకేల్లో అందుబాటులోకి తీసుక వచ్చారని పేర్కొన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. కమిటీ డైరెక్టర్‌లు, మండల వ్యవసాయాధికారి తులసీరామ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో ఇస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వైస్ ఎంపీపీ పుష్ప అన్నారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపసర్పంచ్ సుమన్, సూపర్‌వైజర్ అనురాధ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆనంద్, ప్రకాష్, విజయ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం మన రాష్ట్రం నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడంతో క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయం వెలుపుల వరకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు స్వామిదర్శనం కల్పించారు. క్యూలో నిరీక్షిస్తున్న భక్తులకు మంచి నీరు అందించారు.

'ఉపాధి' పనులపై గ్రామసభ



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం: మండల ప్రజలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ అనురేఖ కోరారు. శుక్రవారం ఆముదాలలో ఏపీఓ మార్గరెట్, జేఈ అనుషా నేతృత్వంలో ఉపాధిహామీ గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ తోపాటు ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడారు. ప్రభుత్వం వలసలను నిరోధించడానికి ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం ఏడాదికి 100 రోజులు పనులు చేసుకోవచ్చన్నారు. అలాగే రైతులు, మునగ, పండ్లతోటల పెంపకంపై మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, ఫీల్డ్ అసిస్టెంట్ మునస్వామి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ



చవటగుంటలో విద్యార్థుల మానవహారం

వెదురుకుప్పం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పచ్చదనం-పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారాలు పొందిన శాస్త్రవేత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ మంగళగౌరి, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు రక్ష..ఆరోగ్య సురక్ష





నిండ్ర: వైద్య శిబిరంలో మట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి, గంగాధరనెల్లూరు : కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ అనిత, ఎంపీడీఓ శ్రీదేవి





కార్వేటినగరం: మాట్లాడుతున్న ఎంపీపీ లత, అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు



వెదురుకుప్పం: జక్కిదొనలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగరాణి



శ్రీరంగరాజపురం: పోషక పదార్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నిండ్ర: ప్రతి పేదవాడి ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వరమని మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పేడులో జగన్నన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ,స్పెషలిస్టు వైద్యాధికారులు ఈ శిబిరం అన్ని వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారని, అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ కింద పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు. అనంతరం శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైద్యాధికారి కల్యాణి, ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ భగవతి, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం పాల్గొన్నారు.

విజయపురం మండలంలో..

విజయపురం (నగరి): విజయపురం మండలం కాళికాపురం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సోమశేఖర్ ఆధ్వర్యంల రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది ఆశోక్ వర్ధన్‌కుమార్, అక్షర పవిన్, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం

గంగాధర నెల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి ఒక వరమని ఎంపీపీ అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్కళ్తురు గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్టులతో వైద్యపరీక్షలను ప్రభుత్వం చేయిస్తోందని, తద్వారా ప్రజలకు ఆరోగ్యానికి భరోసా ఇస్తోందన్నారు. అనంతరం రోగులను వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అలాగే నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారినీ పరీక్షించి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనీల, ఎంపీటీసీ సుశీల, ఎంపీడీఓ శ్రీదేవి, డాక్టర్ షర్మిల, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్బు, మగిమైదాస్, సిద్ధయ్య, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ కండ్రిగలో..

కార్వేటినగరం: మండలంలోని ఎంఎం విలాసం సచివాలయ పరిధిలోని ఎస్ఆర్ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ శృతి, డాక్టర్ మురళి తమ సిబ్బందితో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తొలుత శిబిరాన్ని ఎంపీపీ లత ప్రారంభించి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. సర్పంచ్ పవన్, ఎంపీటీసీ దేశమ్మ, ఎంపీడీఓ మోహన్‌మురళి, ప్రత్యేకాధికారి త్రిశూల్, కార్యదర్శులు జయప్రకాష్, హేమాద్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చందురాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సచివాలయ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జక్కిదొనలో..

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. తొలుత ఎంపీపీ నాగరాణి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీఓ సుధాకరరావు, ఈఓపీఆర్డీ పురుషోత్తం, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, సర్పంచులు కావేరి, గోవిందయ్య, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లూరులో..

శ్రీరంగరాజపురం: మండలంలోని పుల్లూరు సచివాలయ పరిధిలోని జెడ్పీ హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మండల వైద్యాధికారులు డాక్టర్ పల్లవి, బాలసుబ్రమణ్యం రెడ్డి, గౌరి తమ సిబ్బందితో రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కృష్ణయ్య మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. సర్పంచ్ భవ్యశ్రీ, బాబు, ఎంపీటీసీ చంద్రశేఖర్, తహసీల్దార్ లోకనాథపిళ్లై, పార్టీ మండల కన్వీనర్ మణి, నాయకులు పవన్, జనార్థన్, హరిరెడ్డి, యోగానందం, ప్రమీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.